

న్యూఢిల్లీలో అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష



ప్రత్యూష్ కాంత్‌తో తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి

ప్రజాశక్తి - చంద్రగిరి: న్యూ ఢిల్లీలో తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి ఆసియన్ డెవలప్మెంట్ బ్యాంక్, సౌత్ ఆసియా డిపార్ట్మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ ప్రత్యూష్ కాంత్‌ని కలిశారు. తుడా పరిధిలో జరుగుతున్న అభివృద్ధి, నిధుల సమీకరణ అవకాశాలపై చర్చించారు. మౌలిక సదుపాయాల విస్తరణకు ఆసియన్ డెవలప్మెంట్ బ్యాంక్ ద్వారా ఫైనాన్షియల్, టెక్నికల్ సపోర్ట్ అందించే మార్గాలపై సానుకూల చర్చ జరిగింది. ఈ సందర్భంగా ప్రత్యూష్ కాంత్, తుడా చేపడుతున్న పట్టణాభివృద్ధి అభినందిస్తూ తగిన సహకారం అందించేందుకు హామీ ఇచ్చారు.

నేటి నుంచి బోధనేతర పనులు బహిష్కరణ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: అక్టోబర్ 7వ తేదీన విజయవాడ పోరుబాటలో రాష్ట్ర ఫ్యాప్టో, రాష్ట్ర వ్యాప్తంగా 10వ తేదీనుండి బోధనేతర, విద్యాశక్తి కార్యక్రమాలను బహిష్కరిస్తున్నట్లు ఫ్యాప్టో ప్రకటించింది. ఈ నిర్ణయం మేరకు, తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయ డిఆర్‌ఓకి, జిల్లా విద్యాశాఖా ధికారి కెవిఎన్ కుమార్‌కి తిరుపతి జిల్లా ఫ్యాప్టో కార్యవర్గ సభ్యులు, మిత్ర సంఘాల సభ్యులు మెమరాండం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫ్యాప్టో చైర్మన్ ఎస్.సురేష్ , డిప్యూటీ సెక్రటరీ జనరల్స్ రామచంద్రయ్య, జగన్నాథం, నాయకులు ముత్యాల రెడ్డి, ఎస్ఎస్ నాయుడు, రవీంద్ర, వాసు, నిర్మల, మురళీకృష్ణ, బాలసుబ్రమణ్యం, మధు, రుక్మాంధ, సుబ్బారావు, పద్మజ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ విడుదల చేస్తున్న ఫ్యాప్టో నాయకులు, ఉపాధ్యాయులు

విద్యాశాఖ అధికారికి వినతి..

రాష్ట్ర, జిల్లా ఫ్యాప్టో పిలుపుమేరకు తిరుపతి అర్బన్ మండల ఫ్యాప్టో నాయకులు పాఠశాలలలో బోధ నేతర పనులను 10 తేదీ, శుక్రవారం నుంచి బహిష్కరిస్తున్నట్టు మెమరాండంను మండల విద్యాశాఖ అధికారి భాస్కర్ నాయక్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో సభ్యులు మునికృష్ణమనాయుడు, మధుసూదన్ రెడ్డి, మురళీకృష్ణ, శ్రీనివాసన్,హేమాద్రి, ఖాదర్ భాష, రేణుకా దేవి, ద్రాక్షాయిని, మోహన్, బిక్కా మురళి, శాంత కుమారి, మల్లికార్జున్, మనోహర్, అగస్టీన్ పాల్గొన్నారు.

రేణిగుంట ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో ఎంఈఓ రంఘ నాథంకు మెమొరాండం ఇచ్చారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనుల వల్ల బోధించే సమయం తగినంత లేకుండా పోతుందనీ, పలు దఫాలుగా విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదు కనుక ఫ్రాప్టో పిలుపు మేరకు బోధనేతర పనులు బహిష్కరించామని ఉపాధ్యాయ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూటిఎఫ్ మండల రేణిగుంట అధ్యక్ష కార్యదర్శులు శశికళా, చంద్ర శేఖర్, ఎస్ టి యునాయకులు సురేష్,నరసింహులు,ఎపిటిఫ్, ఏపీటీఎఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.




బియన్ కండ్రిగలో విద్యాశాఖ అధికారికి మెమొరాండం

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని ఫ్యాప్టో నాయకులు మండల విద్యాశాఖ అధికారులు రవీంద్రనాథ్, ముని సుబ్రమణ్యంకు గురువారం వివిధ యాప్‌లను, బోధనేతర పనులను బహిష్కరిస్తున్నట్లు మెమోరాండం అందించారు. ఈ యాప్‌ల వల్ల ఉపాధ్యాయులు విద్యార్థులకు సరైన బోధన చేయలేక పోతున్నారని, విద్యార్థులు నష్టపోతున్నారని తెలిపారు. పై అధికారులకు తెలియజేసి యాప్‌లను రద్దు చేసే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్ధసారధి, రామచంద్రయ్య, సమితి వెంకటేష్, సురేష్, కోదండరావ్, గిరిబాబు తదితరులుపాల్గొన్నారు.

ఆన్లైన్ పని భారం తగ్గించండి..

ప్రజాశక్తి - కేవీబి పురం: కేవీబి పురం మండలంలో పనిచేస్తున్న ఉపాధ్యాయ సంఘాలన్నీ కలిసి ఎంఈఓ రవికుమార్‌కు బోధ నేతర పనులు, వివిధ యాప్‌లు రద్దు చేయాలని వినతి పత్రం సమర్పించారు. వివిధ యాప్‌లతో బోధన ఇబ్బందిగా ఉందని ఉపాధ్యాయులు తెలిపారు. ప్రభుత్వం ఆన్‌లైన్ యాప్స్ భారం తగ్గించి, బోధనేతర కార్యక్రమాలను తొలగించాలని కోరారు.ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి అక్కుపల్లి హేమాంబరధరరావు, వై ధర్మరాజుల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కెవిబి పురంలో.. యంఈఓకు మెమొరాండం



సదరం పరీక్షల్లో ప్రభుత్వ నిబంధనలు పాటించండి



వికలత్వం శాతాన్ని నిర్ధారిస్తూ రుయాసుపత్రిలో నిర్వహిస్తున్న పరీక్షా కేంద్రాలను తనిఖీ చేస్తున్న కమిషనర్ మౌర్య

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: సదరం ధ్రువ పత్రాల కోసం నిర్వహించే పరీక్షలను పారదర్శకంగా ప్రభుత్వ నిబంధలను పాటిస్తూ నిర్వహించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య వైద్యులకు సూచించారు. వికలత్వం శాతాన్ని నిర్ధారిస్తూ రుయాసుపత్రిలో నిర్వహిస్తున్న పరీక్షా కేంద్రాలను గురువారం ఆమె తనిఖీ చేశారు. ఏ విధంగా పరీక్షలు చేస్తారు, రోజూ ఎంతమందికి పరీక్షలు నిర్వహిస్తున్నారనే విషయాలను రుయా వైద్యులు ఆమెకు వివరించారు. చెవి, ముక్కు, ఎముకలు, మానసిక రోగులకు ఈ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వైద్యులు అందించే సదరం ధ్రువ పత్రాల మేరకు వికలాంగులకు పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉంటుందన్నారు. ఇందులో ఎటువంటి అవకతవకలు లేకుండా ప్రభుత్వ నిబంధనల మేరకు పారదర్శకంగా పరీక్షలు చేయాలాని వైద్యులకు సూచించారు. రోజుకి వందమందికి పరీక్షలు చేసేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. కమిషనర్ వెంట డిప్యూటీ కమిషనర్ అమరయ్య, రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రాధ, ఆర్ ఎం ఓ డాక్టర్ హరికృష్ణ, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, పలువురు వైద్యులు ఉన్నారు.

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



రుయా ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందిస్తున్న సిఐటియు నేతలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్, తిరుపతి సిటీ: ఇరవై ఏళ్ల నుండి రుయా ఆసుపత్రిలో పారిశుధ్య కార్మికులగా పనిచేస్తున్న దాదాపు యాభై మందిని కొత్తగా టెండర్ దక్కించుకున్న పద్మావతి కంపెనీ యాజమాన్యం భాస్కర్ నాయుడు తొలగించడం అన్యాయమని, తొలగించిన కార్మికులను విధులలోకి తీసుకోవాలని కోరుతూ గురువారం రుయా ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు సిఐటియు నేతలు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రుయా కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు కె .వేణుగోపాల్, సిఐటియు నగర అధ్యక్ష, కార్యదర్శులు పి.బుజ్జి, ఎన్.మాధవ్‌లు మాట్లాడుతూ పద్మావతి కంపెనీ కాంట్రాక్ట్ తీసుకుని కేవలం వారం రోజులు మాత్రమే అయిందని, కార్మికులు గత 20 ఏళ్ల నుండి రుయా ఆసుపత్రిలో పనిచేస్తున్నారన్నారు. ఒక్కో కార్మికుడు 12 వార్డుల వరకు పనిచేసేటువంటి సామర్థ్యం గల కార్మికులను హఠాత్తుగా తొలగించి వీధులు పాలు చేయడం సరైనది కాదన్నారు. తక్షణం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనకు పూనుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం రుయా ఆసుపత్రి సూపరింటెండెంట్ మాట్లాడుతూ కార్మికుల పట్ల మాకేమి వ్యతిరేకతలేదని, మేము తొలగించిన కార్మికులను కొనసాగించడానికి కాంట్రాక్టర్‌కు చెప్పి కొనసాగించడం కోసం ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు.

ఎస్వీయూ నూతన విసి నేడు బాధ్యతల స్వీకరణ



ఆచార్య టి నర్సింగరావు

ప్రజాశక్తి - క్యాంపస్: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం నూతన ఉపకులపతిగా ఐఐటి హైదరాబాద్‌లో పనిచేసే ఆచార్య టి నర్సింగరావును రాష్ట్ర గవర్నర్ నియమించిన సంగతి తెలిసిందే. ఆచార్య టాటా నర్సింగారావు 1994లో బనారస్ హిందూ విశ్వవిద్యాలయం నుంచి రసాయన శాస్త్రంలో పీహెచ్డీ పట్టా పొందారు. ఐఐటి మద్రాసులో పరిశోధక సహాయకులుగా పనిచేసి, 1996లో జపాన్ యూనివర్సిటీ ఆఫ్ టోక్యో లో జేఎస్పీఎస్ పోస్ట్ డాక్టర్ ఫెలోగా పనిచేశారు. 2001 సంవత్సరంలో అదే విశ్వవిద్యాలయంలో లెక్చరర్‌గా నియమితులయ్యారు. 2003లో హైదరాబాదులోని అంతర్జాతీయ పరిశోధనా కేంద్రంలో సీనియర్ శాస్త్రవేత్తగా చేరి, ప్రస్తుతం ఏఆర్సిఐ డైరెక్టర్గా వ్యవహరిస్తున్నారు. అంతేకాకుండా ఐఐటి హైదరాబాదులో అదనపు ఆచార్యులుగా సేవలందిస్తున్నారు. ఆయన పలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అనేక అవార్డులు, పురస్కారాలు, సత్కారాలు అందుకున్నారు. ఇప్పటివరకు ఆయన 190 కి పైగా అనేక పరిశోధనా పత్రాలను అంతర్జాతీయ స్థాయిలో పేరుపొందిన జర్నల్స్‌లో ప్రచురించారు. ఎస్వీయూకి శాశ్వత వీసిని నియమించడం పట్ల వర్సిటీలోని విద్యార్థులు, పరిశోధకులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. గత సంవత్సర కాలంలో వర్సిటీలో పరిపాలనా పూర్తిగా మరుగున పడిందని, బోధన, పరిశోధన రంగాలు పూర్తిగా బూజు పట్టిపోయాయని మేధావులు, పరిశోధకులు, శాస్త్రవేత్తలు, విద్యార్థి సంఘాల నేతలు తీవ్రస్థాయిలో విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా నూతన విసిగా నియమితులైన ఆచార్య టాటా నరసింగారావు శుక్రవారం ఉదయం ఉప కులపతి చాంబర్లో వర్సిటీ నూతన వీసీగా పదవి బాధ్యతలు స్వీకరిస్తున్నట్లు వెల్లడించారు.

యువత పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, నారాయణ ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ వారు స్టార్టప్ ఆలోచనలను స్థిరమైన సంస్థలుగా మారుస్తూ, కొత్త వ్యాపార విప్లవం అంశంపై ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వినయ్ కుమార్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా యువ పారిశ్రామిక వేత్తల ఆవిష్కరణలను ప్రోత్సహిస్తూ, స్టార్టప్ ఆలోచనలను స్థిరమైన లాభదాయకమైన సంస్థలుగా తీర్చిదిద్దేందుకు ఒక కొత్త కార్యక్రమం ప్రారంభమైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు 60 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డా.బి. వి. కృష్ణయ్య, కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ డా. దత్తాత్రేయ శర్మ, డీన్ ప్రొఫెసర్ డా.విశ్వక్ సేన రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డా.జె వి యస్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బావమరిది భార్యపై అత్యాచారం..

- మానవ మృగం పై కేసు నమోదు

ప్రజాశక్తి - సత్యవేడు : సత్యవేడు మండలం, ఇరుగుళం గ్రామం, అటవీ ప్రాంతంలో బావమరిది భార్యపై మానవత్వం మరిచిన ఓ మానవ మృగం అఘాయిత్యానికి పాల్పడినఘటనపై శ్రీ సిటీ పోలీస్ స్టేషన్లో కేసు నమోదయింది. శ్రీ సిటీ డిఎస్పి డివి శ్రీనివాసులు ఇచ్చిన సమాచారం మేరకు వరదయ్యపాలెం మండలం, వికెఆర్‌వై కాలనీకి చెందిన దివ్య (20) భర్త ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఆయన తమిళనాడుకు చెందిన చెన్నై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. తన భర్తను చూసి ఆయనకు దుస్తులు, సామాగ్రి అందించి రావడానికి, దివ్య తన ఆడబిడ్డ భర్త అయినా గురవయ్యను సహాయం కోరింది. గురువయ్య దివ్యను ద్విచక్ర వాహనంపై తీసుకొని వెళ్ళాడు. ఆస్పత్రి నుండి ఇంటికి చేరుకుంటున్న నేపథ్యంలో శ్రీ సిటీ పరిధిలోని ఇరుగుళం రహదారిలోని అటవీ ప్రాంతంలో వావి వరస మరచిన గురువయ్య చెల్లెలు వరసైన దివ్యపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ సంఘటనపై శ్రీ సిటీ డిఎస్పి డివి శ్రీనివాసులు ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

టీటీడీలో డిప్యూటీ ఈవోల బదిలీలు



ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: తిరుమల తిరుపతి దేవస్థానంలో పలువురు డిప్యూటీ ఈవోలను బదిలీ చేస్తూ టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్ ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవోగా హరీంద్రనాథ్‌ను నియమించారు. అక్కడ పనిచేస్తున్న లోకనాథంను తిరుపతి, గోవిందరాజస్వామి ఆలయానికి బదిలీ చేశారు. హెచ్ఆర్ డిప్యూటీ ఈవోగా భాస్కర్, తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయ డిప్యూటీ ఈవోగా శాంతిని, ఆర్1 డిప్యూటీ ఈవోగా నియమితులైన రాజేంద్ర ఆర్2 ఇంఛార్జ్‌గా అదనపు భాధ్యతలు అప్పగించారు. తిరుమల అన్నదానం డిప్యూటీ ఈవోగా సెల్వం, తిరుపతి అన్నదానం డిప్యూటీ ఈవోగా వెంకటయ్య, కల్యాణకట్ట డిప్యూటీ ఈవోగా గోవిందరాజన్ డోనార్ సెల్ ఇంఛార్జ్‌గా అదనపు భాధ్యతలు ఇచ్చారు. టీటీడీలో పాతుకుపోయిన అధికారులను ప్రక్షాళన దిశలో భాగంగా ఈవో ఈ బదిలీలు చేసినట్లు తెలుస్తోంది.

జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ బదిలీ

- పరిశ్రమల శాఖ డైరెక్టర్‌గా నియామకం



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న శుభం బన్సల్ ను పరిశ్రమల శాఖ డైరెక్టర్ గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయ్ ఆనంద్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా పలువురు ఐఎఎస్ అధికారులకు పోస్టింగులు, పలువురు జాయింట్ కలెక్టర్లకు స్థానచలనం కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకొని ఉత్తర్వులు జారీ చేసింది. గత ఏడాది జూలై 24వ తేదీ తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ గా శుభం బన్సల్ ను ప్రభుత్వం నియమించింది. నాటి నుండి నేటి వరకు తిరుపతి జిల్లాలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలలో చురుగ్గా బన్సల్ పనిచేశారు. పిజిఆర్ఎస్ లో వచ్చే అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారం లభించిందా లేదా అని నేరుగా అర్జీదారుని ఇంటికి వెళ్లి శుభం బన్సల్ పరిశీలించిన సందర్భాలు ఉన్నాయి. తుడా విసిగా కూడా శుభం బన్సల్ అదనపు బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు.

అంగన్వాడీల పోరాట విజయం

- మినీ వర్కర్ల అభినందన సభలో సిఐటియు నేతలు



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా కావడానికి అంగన్వాడీలు చేపట్టిన రాజీలేని పోరాటాలే కారణమని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి వ్యాఖ్యానించారు. వేమన విజ్ఞాన కేంద్రంలో గురువారం మినీ వర్కర్ల అభినందన సభలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. లక్ష మందికి పైగా ఉన్న అంగన్వాడీల పట్ల గత ప్రభుత్వం అనుసరించిన అమానవీయ విధానాల ఫలితంగా ఎన్నికలలో తగిన మూల్యం చెల్లించుకుందని గుర్తు చేశారు. 42 రోజుల అంగన్వాడీల పోరాటం సందర్భంగా గత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం విధించిన తీవ్ర నిర్బంధం పెను శాపమై తరువాతి ఎన్నికలలో అధికారానికి దూరం చేసిందన్నారు. కార్మికులు, కష్టజీవులు పట్ల అమానవీయంగా ప్రవర్తించే ఎవరికైనా ఈ దుస్థితి తప్పదని హెచ్చరించారు.16 నెలల కూటమి ప్రభుత్వంలో అంగన్వాడీల సమస్యలు కొన్ని పరిష్కారం అయ్యాయని అందుకు ప్రభుత్వాన్ని అభినందిస్తున్నామన్నారు. ప్రధాన సమస్య వేతనాల పెంపుపై ఇంకా నిర్ణయం చేయకపోవడం సమంజసం కాదన్నారు. ఎన్నికలకు ముందు అంగన్వాడీలు ఏర్పాటు చేసుకున్న శిబిరాల వద్దకు టిడిపి నేతలు పోటీపడి వచ్చి మద్దతు ప్రకటించారని తాము అధికారంలోకి వస్తే వేతనాలు పెంచుతామని పలుమార్లు ప్రకటించారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అంగన్వాడీలను ఉద్దేశించి కుప్పం, వెంకటగిరి సభలలో అనేక ప్రకటనలు చేశారని తాము అధికారంలోకి వస్తూనే అంగన్వాడీలకు సంతృప్తికరమైన వేతనాలు ఇస్తామని చెప్పిన విషయాన్ని ప్రస్తావించారు. చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్‌లు అధికారంలోకి వచ్చాక ఒక్కసారి కూడా అంగన్వాడీలను పలకరించటం కానీ వారి సమస్యలపై చర్చించడం కానీ చేయకపోవడం సమంజసమేనా? అని ప్రశ్నించారు. పనిగంటలు పెంచడంలో ఉన్న శ్రద్ధ వేతనాలు పెంచడంలో చంద్రబాబు ప్రభుత్వానికి ఎందుకు లేదన్నారు. అంగన్వాడీల ప్రధాన డిమాండ్ వేతనాల పెంపుపై ప్రభుత్వం ప్రకటన చేయని పక్షంలో మరో చారిత్రక పోరాటం రాష్ట్రంలో ప్రారంభమవుతుందని, ఆ పరిస్థితిని కొని తెచ్చుకోక ముందే చంద్రబాబు ప్రభుత్వం సానుకూలంగా స్పందించి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ విజయోత్సవ సభకు అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పద్మలీల అధ్యక్షత వహించగా జిల్లా ప్రధాన కార్యదర్శి యస్.వాణిశ్రీ, రాజేశ్వరి, ఇంద్రాణి, నిర్మల, నాగభూషణమ్మ, ధనమ్మ, ప్రభావతి, నాగరాజమ్మ, మోహనమ్మ, సౌజన్య తదితరులు ప్రసంగించారు. అంగన్వాడి సిబ్బందికి వేతనాలు పెంచే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం స్పందించకుంటే పెద్ద ఎత్తున పోరాటం చేపట్టాలని, రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు పోరాట పద్ధతులను నిర్ణయించుకోవాలని సమావేశం నిర్ణయించింది. ఈ విజయోత్సవ సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సిఐటియు నేతలు ఎస్.పుల్లయ్య, దాసరి జనార్ధన్ టి.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొని మద్దతు ప్రకటించడమే కాకుండా విజయాన్ని సాధించిన మినీ అంగన్వాడి వర్కర్లను అభినందించారు.

ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీగా 'పీపుల్స్ ఐఏఎస్ ఆఫీసర్' శివశంకర్

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: పీపుల్స్ ఐఎఎస్ ఆఫీసర్‌గా పేరు గడించిన శివశంకర్ లోతేటిను ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శివశంకర్ గతంలో పని చేసిన ప్రతీ చోట పాడేరు సబ్ కలెక్టర్ నుండి కడప కలెక్టర్ వరకూ ప్రజల ఐఎఎస్ అధికారిగా ప్రత్యేక గుర్తింపు పొందారు. సాధారణంగా అధికారులు ప్రభుత్వం చెప్పిన పనులు, లక్ష్యాలకే పరిమితం అవుతారు. వాటితో పాటు, ప్రత్యేకమైన చొరవ తీసుకుని అటు ప్రజలకు, ఇటు ప్రభుత్వానికి ఉపయోగపడేలా పని చేసిన ప్రతీ చోటా అనేక ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టారు. ముఖ్యంగా ప్రతి సోమవారం జరిగే గ్రీవెన్స్ డేలో ప్రజలను వివిఐపీలుగా చూస్తారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ 'పీపుల్స్ ఐఎఎస్ ఆఫీసర్'గా పేరు సంపాదించుకున్నారు.

శివశంకర్ 2013 బ్యాచ్‌కు చెందిన అధికారి. విజయనగరం జిల్లా ధర్మవరం గ్రామవాసి. తండ్రి సన్యాసప్పుడు విశాఖపట్నంలోని ఐటిడిఎ పాడేరులో ఆరోగ్యశాఖలో ఎమ్పీహెచ్ఏగా పని చేసేవారు. పదవ తరగతి వరకు జిల్లా పరిషత్ హైస్కూలు, ధర్మవరంలో చదువుకున్నారు. ఇంజనీరింగ్ నీట్ సూరత్కాల్‌లో పూర్తి చేసి అక్టోగా పని చేస్తూ ఐఎఎస్ సాధించారు. 2016-17లో పాడేరులో సబ్ కలెక్టర్ అండ్ పీఓ ఐటీడీఏగా పని చేశారు. శుక్రవారం ఓ యువకుడు వచ్చి మా ఊరులో మంచి జలపాతం ఉంది, టూరిజం అభివృద్ధి కి అవకాశం ఉంది ఓ సారి చూసి వెళ్లండి అని అడిగందే తడవు వెళ్లి చూసి కొల్లాపుట్టు జల తరంగిణి అనే పేరుతో అభివృద్ధి చేసి రిసార్టులు ఏర్పాటయ్యేలా చేసి స్థానిక గిరిజన యువతకు ఉపాధి కల్పించారు. ఇంకా బొర్రా గుహల సంక్షిప్త చరిత్రను తెలుగులో స్వయంగా రాసి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. అరకు గిరిజన మ్యూజియం, పద్మాపురం గార్డెన్స్ ఆధునీకరించారు. కటిక జలపాత అభివృద్ధి నిర్వహణ స్థానిక గిరిజన యువత చేతిలో పెట్టారు .ఐటీడీఏ సందర్శకుల కోసం ఎస్ఆర్ శంకరన్ సంక్షేమ కాంటీన్ ఏర్పాటు చేశారు. అప్పటి ప్రభుత్వం తొలిసారిగా మోదకొండమ్మ జాతర ను రాష్ట్ర పండుగగా ప్రకటించింది ఈ సమయంలోనే చాపరాయి జలపాతం కాదని, దానిని మార్చి చాపరాయి జలవిహారి నామకరణం చేసి అభివృద్ధి చేశారు.



2017-19లో సీతంపేట ఐటీడీఏలో పని చేసి అక్కడ చెరగని ముద్ర వేసారు. అక్కడి గిరిజనులకు ఆయన ఓ ఆశాజ్యోతి. వారి కోసం ఎన్నో మంచి కార్యక్రమాలు చేశారు. ముఖ్యంగా వారికి అనేక స్వయం ఉపాధి అవకాశాలు కల్పించారు. గిరిజన యువత కాంట్రాక్టర్లుగా ఎదిగేలా చేశారు. స్థానికంగా గిరిజన యువతతో పౌల్ట్రీలు పెట్టించి హబ్ స్పోక్ మోడల్‌లో స్కూల్స్‌లో చికెన్ అందేలా చేశారు. ఓ సంవత్సరం తర్వాత, ఇక్కడ మెనూ గురించి తెలుసుకున్న ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా మెనూలో చికెన్‌ను చేర్చింది. అలాగే అక్కడి హాస్పిటల్స్ రూపురేఖలు మార్చి రాష్ట్రంలోనే అత్యుత్తమ గిరిజన హాస్పిటల్స్‌గా తీర్చిదిద్దారు. సిహెచ్ సి సీతంపేట అయితే ఓ ప్రత్యేకం . గిరిజన ప్రాంతంలోనే తొలి ఎయిర్ కండిషన్డ్ హాస్పిటల్‌గా కార్పోరేట్ తరహాలో అభివృద్ధి చేశారు. 2019 ఫిబ్రవరి వరకూ ఆ జిల్లా ఎలా అభివృద్ధి చెందుతూ వచ్చిందో మినియేచర్ మోడల్స్‌తో శివశంకర్ ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ శ్రీకాకుళం జిల్లా ప్రజలు ఇప్పటికీ మర్చిపోలేరు. 2020-22లో కృష్ణాజిల్లా జాయింట్ కలెక్టర్‌గా 116 సచివాలయాలు ఐఎస్ఓ 9001 సర్టిఫైడ్ కార్యాలయాలుగా తీర్చిదిద్దారు. 2022-24లో పల్నాడు జిల్లా ప్రథమ కలెక్టర్‌గా పనిచేసిన శివశంకర్ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేశారు. రెవెన్యూ సమస్యలకైతే స్వయంగా కలెక్టరే జడ్జిలా వ్యవహరించి ఇరు పక్షాల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి న్యాయం చేసేవారు.

'పల్నాడు వర్మీ- పొలానికి బలిమి' అనే బ్రాండ్‌తో ప్రతి పంచాయతీలోనూ ఎస్‌డబ్ల్యుపిసిలను బలోపేతం చేసి వర్మీ కంపోస్ట్‌ను రైతులకు, వినియోగదారులకు దగ్గర చేశారు. 2024లో కడప కలెక్టర్‌గా చేసింది మూడు నెలలైనా అక్కడా చెరగని ముద్ర వేశారు. రెవెన్యూ సమస్యలను తనదైన శైలిలో పరిష్కరించడానికి ప్రయత్నించారు. ఇంకా క్రీస్తు శకం 575 నాటి తొలి తెలుగు శాసనం ఎర్రగుంట్ల మండలంలోని కలమళ్ళ గ్రామంలో నిరాదరణగా ఉంటే దానిని గుర్తించి ఆగస్టు 29న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతుల మీదగా శాసనానికి గౌరవ ప్రతిష్ఠ చేశారు. గండికోట అభివృద్ధిలో స్థానిక భాగస్వామ్యం ఉండాలనే లక్ష్యంతో గండికోట టూరిజం డెవలప్మెంట్ కమిటీ ఏర్పాటు చేశారు. గ్రామోదయం ద్వారా గ్రామీణ ప్రాంతాల పర్యటన ముమ్మరం చేశారు. సీపీ బ్రౌన్ లైబ్రరీ ఆధునీకరణ పనులు వేగవంతం చేశారు.

చేగువేరా గొప్ప మానవతావాది



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : చేగువేరా విప్లవకారుడు మాత్రమే కాదని, ఆయన గొప్ప మానవతావాది అని చేగువేరా ఫౌండేషన్ వ్యవస్థాపకులు సురేష్ బాబు తెలియజేశారు. గురువారం చేగువేరా వర్ధంతి సందర్భంగా గూడూరు, అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు గుండాల ఆదినారాయణ, దువ్వూరు దిలీప్ రెడ్డి ఓబిలి బాబు శేఖర్ రెడ్డి మల్లికార్జున్‌రెడ్డి జగన్ రెడ్డి, సురేష్ రెడ్డి, తదితరులు, పాల్గొన్నారు.

అధ్వానంగా ఎగవ గూకూరు రోడ్డు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : తిరుపతి- చెన్నై జాతీయ రహదారి నుంచి తడుకు, ఎగవగూకూరు, దళితవాడ, దిగువ గూకూరు, పొట్టిగుట్టలు, సిరుగురాజుపాళెం ప్రజల కోసం అప్పటి ఎమ్మెల్యే ముద్దుకృష్ణమ రింగ్ రోడ్డు నిర్మించారు. కాలక్రమేణా నిర్వహణ పనులు చేపట్టకపోవడంతో రోడ్డంతా గుంతలమయంగా మారింది. గ్రామ ప్రజలు ప్రజా ప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని వాపోతున్నారు. అలాగే తిరుపతి - చెన్నై రహదారిలోని వేణుగోపాలపురం, వీఎస్ఎల్ పురం మధ్య రోడ్డు కూడా గుంతలమయంగా మారింది. ఈ రోడ్డు మీదుగా సదాశివేశ్వర కోనకు వెళ్లాల్సి ఉంది. ప్రజా ప్రతినిధులు అధికారులు పట్టించుకోవాలని గ్రామీణులు కోరుతున్నారు.

ఎంబియు యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - క్యాంపస్ : మోహన్ బాబు యూనివర్శిటీ గుర్తింపు రద్దు చేసి, మంచు మోహన్ బాబు, మంచు విష్ణుల పై క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ తిరుపతిలోని బాలాజీ కాలనీలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్, జిల్లా అధ్యక్షులు శివ బాలాజీ మాట్లాడుతూ యంబియులో ఫీజుల అక్రమాలు, నిధుల దుర్వినియోగంపై తీవ్రంగా విమర్శించారు. ఉన్నత విద్యా మండలి, ఆంధ్రప్రదేశ్ ఫీజు రెగ్యులేటరీ కమిటీ విచారణ చేసి రూ.15 లక్షల జరిమానా విధించి, విద్యార్థులకు రూ. 23 కోట్లు తిరిగి చెల్లించాలని ఆదేశించడం సరైన చర్య అన్నారు. కానీ వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ యూత్ జిల్లా అధ్యక్షుడు శివ బాలాజీ, జిల్లా ప్రధాన కార్యదర్శి మస్తాన్, జిల్లా కార్యదర్శి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పదంగా పంచాయతీ విభజన గ్రామసభ

ప్రజాశక్తి - బాలాయపల్లి: మండలంలోని వెంగమాంబపురం గ్రామ పంచాయతీలోని అక్కసముద్రం గ్రామాన్ని పంచాయతీగా ఏర్పాటు చేయాలని టీడీపీ నాయకుల వినతి మేరకు గురువారం వెంగమాంబపురం సచివాలయం వద్ద పంచాయతీ కార్యదర్శి దయాకర్ గ్రామ సభ నిర్వహించారు. పంచాయతీ విభజన కొరకు ప్రజల అభిప్రాయాన్ని సేకరించేందుకు నిర్వహించిన గ్రామ సభకు 122 మంది హాజరుకాగా వైసీపీ సర్పంచ్ బావనపల్లి వెంకటసుబ్బయ్య పంచాయతీ విభజనను వ్యతిరేకిస్తూ గ్రామ సభను బహిష్కరించి వెళ్లిపోవడంతో ఇరు గ్రామాల టీడీపీ నాయకులు, కార్యకర్తల మధ్య వివాదం నెలకొంది. ఇరు గ్రామాల ప్రజలు వివాదానికి కాలుదువ్వడంతో స్థానికంగా కొందరు కలుగజేసుకుని సర్దుబాటు చేసి పంపారు. అక్కసముద్రం గ్రామస్తులు తమ గ్రామాన్ని పంచాయతీగా ఏర్పాటు చేయాలని అధిక సంఖ్యలో గ్రామసభకు హాజరుకాగా సర్పంచ్ వెళ్లిపోవడంతో గ్రామ సభ వాయిదా పడింది. తమకు జరుగుతున్న అన్యాయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళతామంటూ వెనుతిరిగారు. అదేవిధంగా నిడిగల్లు పంచాయతీ నుండి గాజులపల్లి, గొల్లపల్లి గ్రామాలను పంచాయతీగా వేరు చేయాలని గాజులపల్లి గ్రామస్థుల వినతితో గురువారం పంచాయతీ కార్యదర్శి మోహన్ రాజు, సర్పంచ్ చెప్పిలి గాయత్రి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. గ్రామ సభకు 110 మంది హాజరుకాగా 109 మంది పంచాయతీ విభజనకు అంగీకరించగా ఒక్కరు వ్యతిరేకించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రత్నమ్మ, నిడిగల్లు సొసైటీ అధ్యక్షులు ఆదినారాయణరెడ్డి, నీటి సంఘం అధ్యక్షులు దాసరి కోటేశ్వరరావు, జనసేన నాయకులు గూడూరు వెంకటేశ్వర్లు, అది రామచంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వన సంరక్షణ సమితులను యాక్టివేట్ చేయండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి రిజర్వు ఫారెస్ట్ పరిధిలో నడుస్తున్న వన సంరక్షణ సమితులను యాక్టివేట్ చేయాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి అటవీ శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన స్థానిక అటవీ శాఖ కార్యాలయాన్ని సందర్శించారు. అడవుల సంరక్షణకు సంబంధించి శ్రీకాళహస్తి అటవీ శాఖ తీసుకుంటున్న చర్యలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. అవసరమైన చోట వన సంరక్షణ సమితి కమిటీలను ఏర్పాటుచేసి అడవుల సంరక్షణ పచ్చదనం పెంపుపై దృష్టి సారించాలని సూచించారు. అనంతరం సింహాచల కండ్రిగ రిజర్వ్ ఫారెస్ట్ భూ వివాదంపై ఎఫ్ఆర్వో లోకేష్ తో చర్చించారు. రైతులు కోర్టుకెళ్లి స్టేటస్కో తెచ్చుకోవడంతో సమస్య పెండింగ్‌లో ఉందని తెలిపారు. రెండు రోజుల్లో సింహాచల కండ్రిగ వెళ్లి వివాదానికి పరిష్కారం ఆలోచించాలని సూచించారు. సింహాచల కండ్రిగ వద్ద వన సంరక్షణ సమితి కమిటీని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అదేవిధంగా శ్రీకాళహస్తి అటవీ శాఖ కార్యాలయాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కోరారు. పలువురు టీడీపీ నేతలు, రిటైర్డ్ ఫారెస్ట్ అధికారులు పాల్గొన్నారు.

అంగన్వాడీ వ్యవస్థను బలోపేతం చేద్దాం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రాష్ట్రంలో అంగన్వాడీ వ్యవస్థను బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక శ్రీకాళహస్తి ఐసిడిఎస్ శాఖ కార్యాలయం వద్ద 8వ రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమాన్ని గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అంగన్వాడీలతో కలిసి స్థూలకాయ నివారణ, చక్కెర, నూనెల వినియోగం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను ప్రోత్సహించడం, బాల్య దశ సంరక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పోషకాహార స్టాళ్లను పరిశీలించారు. సీడీపీఓ దుర్గా పాల్గొన్నారు.

రైల్వే అధికారులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - రేణిగుంట: తిరుపతి జిల్లా, రేణిగుంట సిఆర్ఎస్ లో రైల్వే షెల్టర్ షెడ్, డీవీజీ, షీపులు పెయింటింగ్ చేస్తుండగా 8 తేదీ రైల్వే కేబుల్ లైన్ ద్వారా విద్యుత్ షాకు గురై శివాజీ(23) గిరిజనుడు 20 అడుగుల పైనుంచి కింద పడి తలకు, నడుము భాగంలో, కాలు తొడ భాగంలో తీవ్రంగా గాయాలపాలయ్యాడు. వెంటనే 108 ద్వారా రైల్వే సిబ్బంది, వర్కర్లు, ఉద్యోగులు కలిసి నారాయణాద్రి హాస్పిటల్లో చేర్పించారు. శివాజీ కోమాలోకి వెళ్లడంతో వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి హరినాథ్, రేణిగుంట సిఆర్ఎస్ రైల్వే కాంట్రాక్ట్ వర్కర్ యూనియన్ గౌరవ అధ్యక్షులు ఈశ్వరయ్య, అధ్యక్షులు అమ్ములు ఆసుపత్రిలో బాధితుడు శివాజీ కుటుంబ సభ్యులను పరామర్శించారు. రైల్వే డిపార్ట్మెంట్ ట్రైనింగ్ ఇవ్వకుండా వర్కర్ల పై నిర్లక్ష్యం తోనే ఈ ప్రమాదం జరిగిందని వారు ఆరోపించారు. సేఫ్టీ పరికరాలు అందించకపోవడం, విద్యుత్ జాగ్రత్తలు తీసుకోకపోవడం పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ఈ ప్రమాదానికి కారకులైన వారిపై చర్యలు తీసుకుని, శివాజీ మెరుగైన వైద్యం అందించాలని, ఇద్దరు రైల్వే కాంట్రాక్టర్ భరించాలని డిమాండ్ చేశారు. రైల్వే అధికారులు రూ. 20 లక్షలు నష్టపరిహారం బాధితుడి కుటుంబానికి ఇవ్వాలని కోరారు.

వేతనాలు అడిగితే కంపెనీ మూసేస్తారా..?




కంపెనీ ముందు ధర్నా చేస్తున్న మహిళా కార్మికులు

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ, వరదయ్యపాలెం: మండల పరిధిలోని, కురంజలం భారత్ షెడ కంపెనీ మేనేజర్, మ్యాన్ పవర్ కాంట్రాక్టర్ల నిర్వాకంతో మూడు నెలలుగా జీతాల కోసం ఎదురుచూస్తున్న కార్మికులు విసిగిపోయి పరిశ్రమ ఎదుట గురువారం నిరసనకు దిగారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ కుటుంబ పోషణ కోసం కాయకష్టం చేసే ప్రతిరోజు వచ్చి పని చేసిన కార్మికుల జీతాలతో షడ కంపెనీ యాజమాన్యం చెలగాటం ఆడుతున్నారని ఆరోపించారు. షడ కంపెనీలో గత మూడు నెలలుగా పని చేసిన కార్మికులకు(మహిళలు) వేతనాలు ఇవ్వకుండా, మా వేతనాలు ఇవ్వండి అని అడిగిన పాపానికి కంపెనీ మూసివేయడంతో వీధినపడ్డామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కంపెనీ మేనేజర్, మ్యాన్ పవర్ కాంట్రాక్టర్ రాజేంద్ర నిర్వాకంతో ఆగ్రహం చెందిన మహిళా కార్మికులు గురువారం నిరసనగా కంపెనీ ఎదుట ధర్నా చేసి ఆందోళనకు దిగవలసి వచ్చిందని తెలిపారు. కంపెనీ మేనేజర్, మ్యాన్ పవర్ కాంట్రాక్టర్ కుమ్మక్కై, కార్మికులని మానసికంగా వేధిస్తున్నారని, వారిని ప్రశ్నిస్తే వారు లేకపోవడంతో, కార్మికుల చట్టాలను ఉల్లంఘిస్తూ తమతో పని చేయించుకుని కొడుతున్నారని కన్నీళ్ల పర్యంతమైనారు. కంపెనీ వ్యవహారాలపై పరిశ్రమల శాఖ కార్మిక శాఖ అధికారులు పట్టించుకోక పోవడంతో కంపెనీ మేనేజర్ మ్యాన్ పవర్ కాంట్రాక్టర్ ఆగడాలు మితిమీరుతున్నాయని ఇకనైనా అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కొన్ని అన్నివార కారణాలవల్ల గత మూడు నెలల జీతాలు చెల్లించకపోవడం నిజమేనని సోమవారం లోపు ఉన్న బకాయిలను పూర్తిగా చెల్లించి కార్మికులు ఇవ్వాల్సిన వేతనాలను చెల్లిస్తామని యాజమాన్యం హామీ ఇవ్వడంతో కార్మికులు ధర్నా విరమించారు.

అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన వారిపై చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : చిత్తూరు జిల్లాలో అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టడాన్ని వ్యతిరేకిస్తూ గూడూరు పట్టణంలోని స్థానిక టవర్ క్లాక్ సెంటర్ వద్ద ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ ఆధ్వర్యంలో దళితులు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. ఈనిరసన కార్యక్రమంలో సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయ శ్రీ, మాజీ మంత్రి పరసా రత్నం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ ఏ ధైర్యంతో అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టారో అర్థం కావడం లేదన్నారు. గత ప్రభుత్వంలో 56 వేల మంది దళితులపై అక్రమ కేసులు బనాయించారని ఆరోపించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి, నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమారి బాబు, రాజేంద్ర, రఘు, మాల మహానాడు అధ్యక్షుడు రాజా, రమేష్, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ ఏసుపాక పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యేలు పాశిం సునీల్ కుమార్, నెలవల విజయశ్రీ తదితరులు

జే.వి.వి ఆధ్వర్యంలో గర్భిణులకు పౌష్టికాహారం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గుర్రం విజయ్ బాబు దాతృత్వంలో గూడూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారాన్ని డాక్టర్ రాజా, చలపతి గౌడ్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక వారు మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా ప్రజల్ని చైతన్య పరుస్తూ, ఇటువంటి సేవా కార్యక్రమాలు చేయటం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో జే.వి.వి అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, నాగరాజు, నారాయణ, రామమోహన్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులు కౌశలం సర్వేను సద్వినియోగం చేసుకోవాలి

:మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా




ప్రజాశక్తి - నాయుడుపేట: నిరుద్యోగులు కౌశలం సర్వేను సద్వినియోగం చేసుకోవాలని నాయుడుపేట మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కౌశలం సర్వేను నాయుడుపేటలో 10 వ తరగతి నుంచి ఆపై చదువుకున్న ప్రతి ఒక్కరు కౌశల్యం సర్వే నువ్వు చేయించుకోవాలని తెలిపారు. 50 సంవత్సరాల లోపల చదువుకున్న ప్రతి ఒక్కరు సచివాలయంలో కౌశలం సర్వే చేయించుకోవాలన్నారు. ప్రభుత్వం కల్పించిని లింకు ద్వారా ప్రతి ఒక్కరు ఈ సర్వే ను పూర్తి చేయాలన్నారు. సర్వే లింకు పూర్తి చేసుకున్న అందరికీ ప్రభుత్వం శిక్షణ ఇచ్చి ఇంటి దగ్గరే ఉండి పని చేసుకొని లబ్ధి పొందడానికి సహాయం చేస్తారని తెలిపారు. చదువుకున్న ప్రతి ఒక్కరూ ఈ సర్వే ను 2,3 రోజుల్లో పూర్తి చేసుకోవాలని కోరారు. సమాచారం కొరకు సచివాలయ సెక్రటరీని సంప్రదించాలనిమీకు సమాచారం కొరకు సచివాలయ సెక్రటరీని సంప్రదించి సర్వే పూర్తి చేయించుకోవాలని తెలియజేశారు.

సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని, లేకుంటే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ మౌర్య హెచ్చరించారు. గురువారం జ్యోతి థియేటర్ సమీపంలోని 30వ వార్డు సచివాలయాన్ని కమిషనర్ ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల నుండి వచ్చే పిర్యాదులను పరిశీలించి వీ లైనంత త్వరగా పరిష్కరించాలని సూచించారు. కమిషనర్ వెంట సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రికి స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర అవార్డు



అవార్డిస్తున్న ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్

ప్రజాశక్తి -పుత్తూరు టౌన్ : రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయి ఎంపికలో పుత్తూరు ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం విశిష్ట గుర్తింపు పొందింది. వైద్య ఆరోగ్యశాఖ తరపున ఈ అవార్డును కలెక్టర్, డీసీహెచ్ఎస్ అధికారి చేతుల మీదుగా ఆసుపత్రి ప్రతినిధులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ వైద్యాధికారులను, సిబ్బందిని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన వైద్యాధికారి జె.చంద్రశేఖర్, సీనియర్ వైద్యుడు ఎ. అన్నాదురై, ఫిజియోథెరపిస్ట్ కె.ప్రకాశ్‌రావు, ల్యాబ్ అసిస్టెంట్ లత, లేడీ సూపర్వైజర్ వి. దేవి, స్టాఫ్ నర్సులు రక్షణ్య దేవి, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ మెరిడీయస్ హోటల్‌ను అన్న క్యాంటీన్‌గా మార్చాలి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి, కపిలతీర్థం సర్కిల్లో వైఎస్ఆర్సిపి హయాంలో అక్రమంగా ఏర్పాటు చేసిన గ్రీన్ మెరిడిఎస్ హోటల్ లీజును రద్దు చేసి, అన్నా క్యాంటీన్‌కు కేటాయించాలని టిడిపి అధికార ప్రతినిధి డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం డిమాండ్ చేశారు. లక్ష్మీపురంలోని బాలసుబ్రమణ్యం నివాసం వద్ద గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కపిలతీర్థం సర్కిల్ వద్దనున్న కార్పొరేషన్ చెందిన భూమిని అక్రమంగా వైసీపీ హయాంలో తమ అనుచరులకు, 99 సంవత్సరాలు పాటు లీజుకు కేటాయించడం దారుణమన్నారు. హోటల్ లీజు వెంటనే రద్దు చేసి, సంబంధితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత కొన్ని రోజులుగా కొంతమంది తమ స్వార్థ ప్రయోజనాల కోసం ఉద్దేశం పూర్వకంగా నాపై సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. అవన్నీ కట్టుకథలని, వాటన్నిటికీ త్వరలోనే సమాధానం చెప్తానన్నారు.

యూరియా సరఫరాలో నిబంధనలు పాటించండి

ప్రజాశక్తి -ఏర్పేడు : ఏర్పేడు ఏవో కార్యాలయంలో ఎరువుల డీలర్లతో శ్రీకాళహస్తి ఏడిఏ రమేష్ ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా సరఫరాలో నిబంధనలను అతిక్రమించిన డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులకు కార్డులు రైతు సేవ కేంద్రాలలో ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్డులలో రైతు పూర్తి వివరాలతో పాటు, రైతుకు ఉన్నటువంటి భూమి విస్తీర్ణానిబట్టి ఎన్ని బస్తాలు ఇవ్వాలో నిర్ణయించాలని తెలిపారు.

పిఎసిఎస్‌ను సందర్శించిన సిక్కిం అధికారులు

ప్రజాశక్తి -ఏర్పేడు : రెండు రోజులపాటు నిర్వహించిన జాతీయ సహకార సమీక్షా సదస్సులో భాగంగా తిరుపతికి విచ్చేసిన సిక్కిం రాష్ట్ర ప్రభుత్వ సహకార శాఖ సెక్రటరీ గ్లోరియా నామ్ చూ, సిక్కిం సహకార శాఖ అదనపు రిజిస్ట్రారు కేసాన్ ధ్యాన్ కీల క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా ఏర్పేడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాన్ని గురువారం సందర్శించారు. ఏర్పేడు ప్యాక్స్‌లో జరుగుతున్న వ్యాపార లావాదేవిలు, పనితీరు, వివిధ సేవలు గురించి తెలుసుకున్నారు. ఇటీవల సంఘంలో కంప్యూటరీకరణతో లావాదేవీలను ప్రారంభించడంతో వారు ఆసక్తిని కనుపరుస్తూ వివిధ లావాదేవీలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా సహకార అధికారిణి ఎస్.వి. నాగవర్ధన, తిరుపతి డివిజనల్ సహకార అధికారి తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం ఢీ.. ఒకరు మృతి



మృతుడు దివాకర్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా మరొకరు గాయపడిన ఘటన గురువారం చోటు చేసుకుంది. తిరుపతి ఉప్పంగి హరిజనవాడకు చెందిన దివాకర్ (19) విధుల్లో భాగంగా చంద్రగిరికి వెళ్లి తిరుపతికి వస్తుండగా పూతలపట్టు-నాయుడుపేట ప్రధాన రహదారిలోని, తిరుపతి రూరల్, రామానుజన్ పల్లె సమీపంలో తాను ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో దివాకర్ తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు అతన్ని 108 వాహనంలో తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో దివాకర్ మృతి చెందాడు. మృతుడి అన్న ఫిర్యాదు మేరకు తిరుపతి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడిపై దాడి



చికిత్స పొందుతున్న మహేశ్వర్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి, న్యూ ఇందిరా నగర్‌కు చెందిన యువకుడిపై, గాంధీపురానికి చెందిన కొంతమంది యువకులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు న్యూ ఇందిరానగర్ 13వ డివిజన్ టిడిపి అధ్యక్షులు సుబ్బయ్య మనవడు మహేశ్వర్ పై, వైసీపీ గాంధీపురం నల్లాని బన్నీ, భరత్, మహేష్, నల్లాని మురుగేష్ తదితరులు కట్టెలతో, రాడ్లతో దౌర్జన్యం చేసి కొట్టారు. గాంధీపురానికి సంబంధించిన వైసిపి పార్టీకి చెందిన నల్లాని కుటుంబీకుల దౌర్జన్యంగా కర్రలతో రాడ్లతో చితకబాదడం, అడ్డొచ్చిన బాధితుడు మహేశ్వర్ వాళ్ల అక్కని కూడా, మహిళ అనికూడా చూడకుండా ఆమెని కూడా చితకబాదరని పోలీసులు తెలిపారు. బాధితుడు ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపడుతున్నామని ఈస్ట్ సీఐ శ్రీనివాసులు తెలిపారు.

చిత్తూరుదే కప్పు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: అనంతపురం వేదికగా జరిగిన రాష్ట్ర స్థాయి అక్రిడిటేషన్ జర్నలిస్టు క్రికెట్ పోటీల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టు విజేతగా నిలిచింది. అనంతలోని రంజీ క్రీడా మైదానమైన ఆర్డీటీలో బుధవారం ఈస్ట్ గోదావరితో ఉత్కంఠగా జరిగిన ఫైనల్ మ్యాచ్ లో ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టు ఘన విజయం సాధించింది. జర్నలిస్ట్ క్రికెట్ టోర్నమెంట్ విజేతకు ఎమ్మెల్యేలు అమిలినేని, బండారి శ్రావణి, ఎమ్ ఎస్ రాజు, సింధూర రెడ్డి మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి కప్పును, ప్రైజ్ మనీని అందజేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ప్రజాశక్తి విలేకరి కామేష్ బౌలింగ్ విభాగంలో జట్టును విజేతగా నిలపడంలో కీలక భూమిక పోషించారు.

క్రైం న్యూస్

9 ఎర్రచందనం దుంగలు స్వాధీనం



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శేషాచలం అటవీ పరిధి, అన్నమయ్య జిల్లా, పుల్లంపేట వద్ద 9 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ఒక స్మగ్లర్‌ను అరెస్టు చేసినట్లు టాస్క్ ఫోర్స్ పోలీసులు తెలిపారు. టాస్క్ ఫోర్స్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆర్ ఐ సాయి గిరిధర్ ఆధీనంలోని ఆర్ఎస్ఐ వినోద్ కుమార్ బృందం బుధవారం అన్నమయ్య జిల్లా పుల్లంపేట నుంచి కూంబింగ్ చేపట్టారని అధికారులు తెలిపారు. ఎం బావి ఫారెస్ట్ బీట్ పరిధిలో రెడ్డిపల్లి చెరువు కట్ట వద్ద ఒక వ్యక్తి తారసపడగా, టాస్క్ ఫోర్స్ సిబ్బందిని చూసి పారిపోయే ప్రయత్నం చేయడంతో వెంబడించి పట్టుకున్నామన్నారు. పట్టుబడ్డ వ్యక్తిని విచారించగా సమీప పొదల్లో ఉన్న దాచి ఉంచిన ఎర్రచందనం దుంగల ఆచూకీ చెప్పాడన్నారు. పట్టుబడ్డ స్మగ్లర్ అన్నమయ్య జిల్లాకు చెందిన వ్యక్తిగా గుర్తించామన్నారు. దీనిపై టాస్క్ ఫోర్స్ సిఐ సురేష్ కుమార్ కేసు నమోదు చేసే దర్యాప్తు చేస్తున్నారన్నారు.

స్కూటర్లు ఢీ.. యువకుడు మృతి



ప్రమాద దృశ్యం.. ఇన్‌సెట్‌లో మృతుడు జశ్వంత్ (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు మండల పరిధిలోని కాంద్ర వెందోడు రోడ్డులో ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా మరొకరికి గాయాలైన సంఘటన చోటు చేసుకుంది. రూరల్ ఎస్ఐ మనోజ్ కుమార్ తెలిపిన వివరాల మేరకు బాలాయపల్లి మండలం, గొట్టిపాడకు చెందిన జస్వంత్ (23) గూడూరు, హెచ్‌డి బి ఫైనాన్స్ కంపెనీలో విధులు నిర్వహిస్తున్నాడని తెలిపారు. ఈ క్రమంలో విధుల్లో భాగంగా గూడూరుకు బైక్‌లో వస్తుండగా, అదే మార్గంలో కాంద్ర నుండి వెందోడు వైపు బైక్ పై వెళ్తున్న వ్యక్తి ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగిందన్నారు. ఈ ప్రమాదంలో జస్వంత్ అక్కడికక్కడే మృతి చెందగా, మరొక వ్యక్తికి గాయపడ్డారని తెలిపారు. గాయపడిన వాడిని చికిత్స నిమిత్తం గూడూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రైలుప్రమాదంలో విద్యార్థి మృతి



మృతుడు సంతోష్ (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి - వరదయ్యపాలెం : బజారు వీధిలో పోలీస్ స్టేషన్ సమీపంలో నివసిస్తున్న కృష్ణవేణి మినుకు పరంధామయ్య (చెన్నవారి పాలెం) దంపతుల ద్వితీయ కుమారుడు ఇంటర్ సెకండ్ ఇయర్ విద్యార్థి సంతోష్ (18) రైలు ప్రమాదంలో మృతి చెందాడు. దసరా సెలవుల అనంతరం గురువారం నెల్లూరు కళాశాలకు తన స్నేహితులతో కలిసి తడ నుంచి రైలులో బయలుదేరిన సంతోష్ మార్గ మధ్యలో నాయుడుపేట వద్ద రైలు నుంచి కింద పడి మృతి చెందాడు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది కేసు నమోదు చేసిన రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం.. వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ప్రభుత్వ పనితీరుపై, ప్రభుత్వ ప్రముఖ నాయకులపై అసత్య, దూషణాత్మక సమాచారాన్ని సోషల్ మీడియా "ఎక్స్ (ట్విట్టర్)" వేదికగా ప్రచారం చేస్తున్న వ్యక్తిని తిరుపతి పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. సత్యసాయి జిల్లా కదిరికి చెందిన అంజాద్ ఖాన్ సోషల్ మీడియా ద్వారా ఇతర రాజకీయ పార్టీల మధ్య, వర్గాల మధ్య విభేదాలు రెచ్చగొట్టే విధంగా, అలాగే ప్రముఖ నాయకుల గౌరవం దెబ్బతీయడమే కాకుండా వారి మనోభావాలు దెబ్బతీసే విధంగా పోస్టులు చేస్తున్నాడు. తన అక్రమ చర్యలలో భాగంగా, టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడు, మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ కుటుంబ సభ్యులు గురించి కూడా అసత్య ప్రచారం జరిపినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈ అంశాలపై అందిన ఫిర్యాదుల మేరకు తిరుపతి వెస్ట్ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా, ముద్దాయిని కదిరి సబ్‌జైలు నుండి పీటీ వారెంట్‌పై తీసుకుని వచ్చి, తిరుపతి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టు ఎదుట హాజరుపరచగా, న్యాయమూర్తి 15 రోజుల రిమాండ్ విధించారు.

గ్యాస్ పైప్ లైన్ పేరుతో నీటి పైపులైన్లు ధ్వంసం

- మూడు రోజులుగా నీళ్లు అందక ప్రజల అగచాట్లు
- అధికారుల అండతో ఊరిని ధ్వంసం చేస్తున్న కార్పొరేటర్లు
- ప్రజా జీవనానికి ఇబ్బందులు కలిగిస్తే ప్రభుత్వ కార్యాలయాలను ముట్టడిస్తాం : సిపిఎం నాయకులు ముకుంద



గుంటలు

ప్రజాశక్తి - నాయుడుపేట: మా రికమండేషన్లు మాకు ఉన్నాయి మమ్మల్ని అడిగేది ఎవరు, ఆపేదెవరు అంటూ కార్పొరేట్ సంస్థలు గ్యాస్ పైపులైన్ల పేరుతో పట్టణంలో ఇష్టానుసారంగా ఎక్కడబడితే అక్కడ గుంటలు లోడేస్తూ ప్రజా జీవనాన్ని స్తంభింప చేస్తున్నారు. ఇబ్బందులు గురవుతున్న ప్రజలు ఎవరైనా ప్రశ్నిస్తే ఎవరికి అందాల్సినవి వారికి అందుతున్నాయి మేము చేయాల్సింది మేము చేస్తాం మమ్మల్ని ఎవరు ఆపలేరు అంటూ ఏ మాత్రం బాధ్యత లేకుండా నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్నారు. గ్యాస్ పైప్ లైన్‌లకు తవ్వుకునేందుకు ప్రభుత్వం వీరికిచ్చిన గడువు పూర్తయి సంవత్సరం అయినప్పటికీ, వీరు మాత్రం గోతులు తీయడం ఆపడం లేదు సంవత్సరం ముందు వరకు తీసిన గుంటలను ఇంతవరకు పుచ్చకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అది చాలదన్నట్టుగా మళ్లీ ఇప్పుడు అంతంత మాత్రంగా ఉన్న రోడ్లను ఏ మాత్రం జాగ్రత్తలు పాటించకుండా జెసిబిలతో ఎలా పడితే అలా లోడేస్తూ ప్రజా జీవనానికి ఆటంకం కలిగిస్తున్నారు. పట్టణంలో ఇంత జరుగుతున్నా వీరి విషయంలో అధికారులు గానీ, నాయకులు గానీ స్పందించిన దాఖలాలు లేవు. వీరిని ఆపేందుకు కాదు కదా కనీసం ఇలా ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించేందుకు కూడా ముందుకు రావడం లేదు. 2022 నుంచి ప్రారంభించి దాదాపు మూడు సంవత్సరాల పాటు ఏకధాటిగా నాయుడుపేట పట్టణ రోడ్లకు తూట్లు పొడిచి ఒప్పందం ప్రకారం అవి పూర్తిచేయకుండా, అనుమతులు లేకుండానే మళ్లీ తవ్వుతుండడం ఏమిటో, అధికారులు, నాయకులు వారిని ఎందుకు ఆపటం లేదో ఇందులోని ఆంతర్యమేమిటో వారికే తెలియాలి. ఈ క్రమంలో మూడు రోజుల క్రితం లోడిన గుంతల కారణంగా పట్టణంలో నీటి సరఫరా చేసే మునిసిపాలిటీ పైపులైను సైతం ధ్వంసం చేశారు. పగిలిపోయిన పైపులైన్లను బాగు చేయకుండా నిర్లక్ష్యంగా వదిలేయడంతో పట్టణంలోని ప్రజలు మూడు రోజులుగా నీళ్లు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాయుడుపేట పట్టణంలోని పొగ గొట్టం, జైహింద్ కాలనీవాసులు రెండు రోజులుగా నీటి కోసం ఎదురు చూచి విసిగిపోయి, నీటి కోసం బిందులతో రోడ్లపైకి రావలసిన పరిస్థితులు ఏర్పడ్డాయి. అందరినీ అడిగి విసిగిపోయిన కాలనీవాసులు కమ్యూనిస్టులు మాత్రమే వారి కోసం పోరాడగాలని నమ్మి నాయుడుపేట సిపిఎం కార్యాలయాన్ని ఆశ్రయించారు. ఈ క్రమంలో సిపిఎం పార్టీ నాయకులు శివకవి ముకుంద మాట్లాడుతూ పొగ గొట్టం ఏరియాలో సుమారు 1000 కుటుంబాలు జీవన సాగిస్తున్నారని తెలిపారు. అధికారులు కార్పోరేటర్ల దయ కోసం వారు చేస్తున్న దురాగతాలను సహకరించడంతో ప్రజల జీవనం ప్రశ్నార్థకంగా మారిందని, నాయుడుపేటలో ఎప్పుడు లేని విధంగా నీటి కోసం రెండు రోజుల నుండి పనులు మానుకొని బిందెలతో పడుకాపులు కాయ వలసిన పరిస్థితులు సృష్టించారని మండిపడ్డారు. కాలనీ వాసులు మున్సిపల్ కమిషనర్‌కి ఫోను చేసి నీళ్లు లేక వారు పడుతున్న ఇబ్బందులు ఆయనకు వివరించి మొరపెట్టుకుంటే కమిష నర్ రెండు ట్యాంకుల నీళ్లు పంపి సర్దుకోమనడం బాధాకరమన్నారు. సుమారు వెయ్యి కుటుంబాలకు రెండు ట్యాంకులు నీళ్లు పంపించడం వారిని హేళన చేయడం లా ఉందని మండి పడ్డారు. ఒక ఉన్నత అధికారి అయ్యుండి ఆయన ప్రవర్తన సరికాదన్నారు. మున్సిపల్ కమిషనర్ పంపించిన రెండు ట్యాంకుల నీళ్లు 100 కుటుంబాలు కూడా సరిపోక కాలనీ మహిళలు బిందెలతో గొడవలు పడడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంనింది. పరిస్థితి గమనించిన సిపిఎం నాయకులు మరికొన్ని వాటర్ ట్యాంకులు అడిగేందుకు కమిషనర్‌కి ఫోను చేస్తే ఇలాంటి విషమ పరిస్థితుల్లో ఆయన ఫోను ఎత్తకపోవడం గమనార్హం. ఓ పక్క ఆర్ అండ్ బి అధికారులు గ్యాస్ లైన్ వారికి అనుమతిలిచ్చి, ప్రజలను ఇబ్బంది పెడుతుంటే మరోపక్క మున్సిపల్ అధికారులు వాళ్ళ ఇష్టానికి లోడేస్తుంటే వాళ్లకి ఏమీ పట్టనట్టు అటువైపు చూడకుండా కళ్ళు మూసుకుంటున్నారు. ఇలాంటి అధికారుల ప్రజల సమస్యల పరిష్కరించేది అంటూ ముకుంద ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ఇలా ప్రజలు ఏమైపోయినా పర్వాలేదు కార్పొరేటర్లు పై స్థాయి నుంచి రికమండేషన్లతో వస్తున్నారు, వారికి సహకరించడం మా విధి వారికి అనుమతులు ఉన్నా లేకున్నా వారేం చేసిన ప్రజలు ఎన్ని ఇబ్బందులు పడిన చూస్తూ ఉండడమే మా ధర్మం అంటూ పట్టణాన్ని కార్పోరేటర్లకు ధారాదత్తం చేస్తే చూస్తూ ఊరుకోబోమని ఇప్పటికైనా అధికారులు నాయకులు ప్రజా సంక్షేమం కోరి తమ విధులు సరిగా నివర్తించకపోతే ప్రజలతో కలిసిప్రభుత్వ కార్యాలయాల ముట్టడి చేస్తామని సిపిఎం నాయకులు శివకవి ముకుందా హెచ్చరించారు.



బిందెలు

బిల్లులు ఇవ్వకుండా మానసికంగా వేధిస్తున్నారు

- చనిపోయాకయినా డబ్బులు నా కుటుంబానికివ్వండి : సెల్ఫీ వీడియోలో జూ టైం స్కేల్ ఉద్యోగి
- బిల్లులన్నీ చెల్లించాం, విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం : ఏసీ జగదీష్ చంద్రప్రసాద్



హరి యాదవ్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శ్రీ వెంకటేశ్వర జంతుప్రదర్శనశాలలో టైం స్కేల్ ఉద్యోగిగా పని చేస్తున్న హరి యాదవ్ తాను ఎస్ వి జూ పార్కులో చేసిన పనులకు సంబంధించి బిల్లులు ఇవ్వలేదని, బిల్లులు చెల్లించకుండా మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని, తాను చనిపోతే తన కుటుంబానికి అయినా బిల్లులు తాలూకా డబ్బులు ఇవ్వాలని ఓ సెల్ఫీ వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో విడుదల చేశాడు. దీంతో ఒక్కసారిగా అలజడి మొదలైంది. ఎస్వీ జూ పార్కులో లక్షల రూపాయల పనులు చేశానని, పనులు చేయడానికి డబ్బులు అవసరం అయితే ఇంటిలోని నగలను సైతం తాకట్టు పెట్టి పనులు పూర్తి చేశానని వీడియోలో వివరించారు. ఇంకనూ తనకు చెల్లించని బిల్లులకు సంబంధించిన నగదు రూ.26 లక్షల రూపాయలు ఉందని చెప్పాడు. బిల్లులు చెల్లింపులు జాప్యంపై ఏసీబీ విచారణ జరపాలని కూడా అన్నారు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో ఒక్కసారిగా హరి యాదవ్ ఎక్కడ ఆత్మహత్య చేసుకున్నాడు అని సహచర ఉద్యోగులతో పాటు ఆయన కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతుండగా, హరి యాదవ్ జూ పార్కులో విధులకు హాజరైనట్లు తెలుసుకొని ఊపిరి పీల్చుకున్నారు. దీనిపై జూ పార్కు అసిస్టెంట్ క్యూరేటర్ జగదీష్ చంద్రప్రసాద్ స్పందించి మాట్లాడుతూ హరి యాదవ్‌కు 2023లోనే ఆయన చేసిన పనులకు సంబంధించిన బిల్లులను చెల్లించడం జరిగిందని, సెప్టెంబర్ మాసంలో హరి యాదవ్ చేసిన పనులపై ఆరోపణలు రావడంతో జూక్యురేటర్ సెల్వం ఏసిఎఫ్ ఆధ్వర్యంలో విచారణ కమిటీ వేశారని, విచారణ సమయంలో తన వద్ద ఏదైనా బిల్లులకు సంబంధించిన రసీదులు ఉంటే చూపించాలని అడగగా అవి ఏమీ లేవని రాతపూర్వకంగా హరి యాదవ్ వ్రాసి ఇచ్చారన్నారు. హరి యాదవ్ చేసిన పనులలో అవకతవకలు ఎక్కడ బయటపడతాయోనని భయభ్రాంతులకు గురై ఇటువంటి వీడియో చేసి ఉంటాడని భావిస్తున్నామన్నారు. క్యూరేటర్ ఆదేశాలతో దీనిపై లోతైన దర్యాప్తు జరిపి అతనిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.